

# కథ కంచికి

చుండూరు,
14-10-1952

గురువుగారూ, నారాయణ్రావ్ గారూ—

ఆరోజు అనుకోకుండా పెళ్ళిలో మీతో పరిచయమై, మీతో మాట్లాడిన తర్వాతే నాకూ కథలు రాయాలనే ఆలోచన వచ్చింది, రావడమే ఆలస్యం ఓ వారం రోజులు కష్టపడి ఓ కథని రాశాను. దాన్ని మీకు పంపిస్తున్నాను. ఈ 'కలకాలం కన్నీరు' కథ మీద మీ అభిప్రాయం తెలుసుకున్న తర్వాతే ఏ పత్రికకైనా పంపుదామనుకుంటున్నాను. ఏవైనా కరెక్షన్స్ అవసరమైతే చేస్తారు కదూ?

మీ
బాబురావు

విజయవాడ
14-11-1952

సచ్చిదానందం—

సినిమా కథకోసం నేను పంపిన 'కలకాలం కన్నీరు' కథ సినా ప్సిస్ చదివావనుకుంటాను. ఆ కథ నీకు నచ్చిందా? నీ దగ్గరనుంచీ జవాబు వచ్చిన తర్వాతే దానిని ఏ పత్రికకైనా పంపాలా- వద్దా? అనేది ఆలోచిస్తాను. వెంటనే జవాబు రాస్తావుకదూ?

—'మీనా'
(మీసాల నారాయణరావ్)

మద్రాసు
14-12-1952

డియర్ మీనా—

నీ కథ 'కలకాలం కన్నీరు' చాలా మంది నిర్మాతలకి వినిపించాను. ఆఖరికి ఓ నిర్మాత ఈ కథని చిత్రంగా తియ్యడానికి ముందుకొచ్చాడు. నాకు దర్శకత్వం చాన్స్ ఇవ్వాలనే కండిషన్ కూడా అతను ఒప్పుకున్నాడు. కాకపోతే అతనూ ఓ కండిషన్ పెట్టాడు. తను నిర్మాతగానే గాక కథకుడుగా కూడా మారాలని! అంటే- నీకు విషయం అర్థమైపోయి వుంటుందనుకుంటాను. ఆయన నీకు కొంత డబ్బుని ముట్ట చెబుతాడు- అంతే! నువ్వా కథ సంగతి మరచిపోవాలి. కథని ఆ నిర్మాత గారే రాశారన్న మాట! వెంటనే బయల్దేరి వస్తావు కదూ?

—సచ్చిదానందం

(జ్యోతి మాసపత్రిక)